సాక్షి
ఏలూరు
సోమవారం, 5, ఫిబ్రవరి, 2024



సస్యరక్షణతో లాభాలు

మామిడిలో సకాలంలో సస్యరక్షణ చేపట్టడం ద్వారా లాభాలు గడించవచ్చని శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. 8లో



ఎల్లలు దాటి సేవలు

దూర ప్రాంతాల్లో ఉంటున్న వారి వద్దకు వెళ్లి మరీ పింఛన్ అందిస్తూ వలంటీర్లు అంకితభావం చాటుతున్నారు. 8లో



మద్ది సన్నిధిలో..

జంగారెడ్డిగూడెం రూరల్ : గురవాయి గూడెం మద్ది ఆంజనేయస్వామి ఆలయాన్ని ఆదివారం ఏలూరు జిల్లా అదనపు జడ్జి జి.రామగోపాల్ సందర్శించారు.

రోడ్ల అభివృద్ధికి నిధులు

- ప్రకృతి వైపరీత్యాలతో దెబ్బతిన్న రోడ్లకు మోక్షం
- 23 రాష్ట్ర, 24 జిల్లా ప్రధాన రహదారుల మరమ్మతులు
- రూ.16.14 కోట్ల నిధుల మంజూరు
- చివరి దశలో టెండర్ల ప్రక్రియ
- త్వరలో పనులు ప్రారంభం

జంగారెడ్డిగూడెం: రాష్ట్రంలో మౌలిక వసతుల కల్పనపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ప్రధానంగా రహదారుల అభివృద్ధికి పెద్దపీట వేస్తూ పనులను శరవేగంగా చేయిస్తోంది. పల్లె నుంచి పట్టణం వరకు రాష్ట్ర ప్రధాన రహదారుల మరమ్మతులు, అభివృద్ధికి నిధులు మంజూరు చేస్తూ రవాణాకు ఇబ్బందులు లేకుండా చూస్తోంది. దీనిలో భాగంగా జిల్లావ్యాప్తంగా రహదారుల నిర్మాణాలు, మరమ్మతులు జరుగుతున్నాయి. తాజాగా మరిన్ని రాష్ట్ర, జిల్లా ప్రధాన రహదారుల మరమ్మతులు, పునర్నిర్మాణానికి ప్రభుత్వం రూ.16.14 కోట్ల నిధులు మంజూరు చేసింది.

సంక్షేమంతో పాటు అభివృద్ధి

ప్రభుత్వం రాష్ట్రంలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు కొనసాగిస్తూనే, అభివృద్ధి పనులకూ నిధులు మంజూరు చేస్తోంది. ప్రకృతి వైపరీత్యాలు, వరదలు, తుపాన్ల కారణంగా దెబ్బతిన్న రహదారులు, బ్రిడ్జిలను మరమ్మతులు చేయించి పునర్నిర్మాణానికి చర్యలు తీసుకుంది. దీనిలో భాగంగా ఏలూరు జిల్లాలో 23 రాష్ట్ర ప్రధాన రహదారులు, 24 జిల్లా ప్రధాన రహదారులను మరమ్మతులు చేసి అభివృద్ధి చేయనున్నారు. ఆయా రోడ్లపై గుంతలను పూడ్చి మరమ్మతులు చేయడంతో పాటు పైన బీటీ లేయర్ వేయనున్నారు. ఇందుకోసం మొత్తంగా రూ.16.14 కోట్లు ఖర్చు చేయనున్నారు. ప్రస్తుతం పనుల టెండర్ల ప్రక్రియ చివరి దశలో ఉండగా.. ఈనెల రెండో వారం నుంచి పనులు ప్రారంభించే అవకాశం ఉంది.



దూబచర్ల–చేబ్రోలు రహదారి నిర్మాణం (ఫైల్)

జిల్లా ప్రధాన రహదారులు

రహదారి	నిధుల మంజూరు (రూ.లక్షల్లో)
భువనపల్లి–నిడమర్రు	50.00
చింతలపూడి–కామవరపుకోట	30.00
శ్రీనివాసపురం–పందిరిమామిడిగూడెం	50.00
జీపీకే రోడ్డు–దేయంపాడు రోడ్డు	30.00
గుండుగొలను–ఆలపాడు	50.00
గొల్లపల్లి–వట్టిగూడుపాడు	40.00
చింతలపూడి–కామవరపుకోట	50.00
చింతలపూడి–కమలాపురం	28.00
నిడమర్రు–చిననింద్రకొలను	25.00
కైకరం–గున్నపల్లి	20.00
ధర్మాజీగూడెం–జీలకర్రగూడెం	20.00
పొంగుటూరు–లక్కవరం	35.00
పోతురెడ్డిపల్లి–రమణక్కపేట	25.00
ఆటపాక–వరహాపట్నం	40.00
కేడీపురం–పైడిచింతపాడు	14.00
బీజీ రోడ్డు–జీపీకే రోడ్డు	60.00
శ్రీనివాసపురం – పందిరిమామిడిగూడెం	35.00
రావికంపాడు–ద్వారకాతిరుమల	16.00
శోభనాపురం–హనుమాన్ జంక్షన్	25.00
పొంగుటూరు–లక్కవరం	25.00
గోపన్నపాలెం–రామసింగవరం	25.00
వరాహాపట్నం–ఉప్పుటేరు	30.00
కేడీపురం–పైడిచింతపాడు	18.00
ఉప్పుటేరు–కలిదిండి	80.00

రాష్ట్ర ప్రధాన రహదారులు

రహదారి	నిధుల మంజూరు (రూ.లక్షల్లో)
చేబ్రోలు–ఉండి	31.00
చింతలపూడి–రావికంపాడు	48.00
పోలవరం–కొయ్యలగూడెం	58.00
నూజివీడు–కైకలూరు	20.00
వద్దమానాడ–పెద్దలంక	80.00
భీమడోలు–కామవరపుకోట	10.00
ఏలూరు–మేడిశెట్టివారిపాలెం	40.00
జంగారెడ్డిగూడెం–ఏలూరు	21.50
నూజివీడు–గన్నవరం	70.00
వడలి–తాడినాడ	40.00
దెందులూరు–పంగిడిగూడెం	25.00
ఏలూరు–జంగారెడ్డిగూడెం	24.00
యర్రగుంటపల్లి–లక్ష్మీపురం	56.00
అడవినెక్కలం–వేలవదం	20.00
నడుపూరు–వడపల్లి–కోరుకొల్లు	36.00
ఏలూరు–మేడిశెట్టివారిపాలెం	40.00
చింతలపూడి–రావికంపాడు	40.00
వినన్నపేట–వెలగపల్లి	20.00
ముదినేపల్లి–గుడ్లవల్లేరు	10.00
సింగరాయపాలెం–గుంటుపల్లి	10.00
చేబ్రోలు–దేవులపల్లి	25.00
చింతలపూడి–గురభట్లగూడెం	25.00
నూజివీడు–ఏలూరు	30.00



ఈ నెలలోనే పనులు

జిల్లాలోని రహదారుల మరమ్మతులు, పునర్నిర్మాణ పనులు త్వరలో ప్రారంభం కానున్నాయి. 23 రాష్ట్ర ప్రధాన రహదారులు, 24 జిల్లా ప్రధాన రహదారులు మొత్తంగా 47 రోడ్ల మరమ్మతుల పనులు చేపట్టి పునర్నిర్మిస్తాం. ఇందుకు రూ.16.14 కోట్లు మంజూరయ్యాయి. ఈనెల రెండో వారం నుంచి పనులు ప్రారంభమవుతాయి.

–సీహెచ్ హరికృష్ణ, డీఈ, ఆర్అండ్‌బీ, జంగారెడ్డిగూడెం

న్యూస్‌రీల్

ఈ–క్రాప్ నమోదు వేగిరపర్చాలి



జగన్నాథపురంలో రికార్డులు పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి వెంకటేశ్వరరావు

పోడూరు: రైతులంతా ఈనెల 15లోపు ఈ–క్రాప్ నమోదు చేయించుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి జెడ్.వెంకటేశ్వరరావు సూచించారు. జగన్నాథపురంలో ఆదివారం ఆయన పర్యటించి ఈ–క్రాప్ పూర్తయిన చేలు, రికార్డులను పరిశీలించారు. ఈ–క్రాప్ నమోదు, ఈకేవైసీ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేసుకోవాలన్నారు. మండల వ్యవసాయాధికారి జి.సత్యనారాయణ మాట్లాడుతూ జగన్నాథపురంలో ఇప్పటివరకు 5 వేల ఎకరాల్లో ఈ–క్రాప్ నమోదు పూర్తయ్యిందన్నారు. వీఏఏలు పి.ఆదినారాయణ, రవీంద్ర ఉన్నారు.

చిత్రలేఖనంలో ప్రతిభ



మంజూషను అభినందిస్తున్న దృశ్యం

తణుకు: ఇటీవల నెల్లూరులో జరిగిన జాతీయ స్థాయి చిత్రలేఖనం పోటీల్లో తణుకుకు చెందిన విద్యార్థిని టి.మంజూష బాలచిత్ర కళాశ్రీ అవార్డు అందుకుంది. పట్టణంలోని రాయసం రాజ్యలక్ష్మి సంగీత నృత్య కళాశాలకు చెందిన మంజూష 9వ తరగతి చదువుతోంది. నెల్లూరు అమీర్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో 'అమ్మ చూపిస్తున్న తన ప్రేమ' పేరుతో వేసిన చిత్రానికి ఉత్తమ బహుమతి లభించింది. కళాశాల ప్రిన్సిపాల్ భమిడి కమలాదేవి, అధ్యాపకురాలు సీహెచ్‌వైఎస్ లక్ష్మి ఆమెను అభినందించారు.

ముగిసిన గేట్ పరీక్షలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఐఐటీ, ఎన్ఐటీల్లో పీజీ ప్రవేశాల కోసం నిర్వహించే గ్రాడ్యుయేట్ అప్టిట్యూడ్ టెస్ట్ ఇన్ ఇంజినీరింగ్ (గేట్) పరీక్షలు ఆదివారం ముగిశాయి. తాడేపల్లిగూడెం వాసవి ఇంజినీరింగ్ కళాశాలలో ఉదయం 125 మందికి 118 మంది, సాయంత్రం 104 మందికి 94 మంది హాజరయ్యారు. ప్రిన్సిపాల్ డాక్టర్ రత్నాకర్‌రావు, కో–ఆర్డినేటర్ నటరాజ్, అడ్మిన్ కొల్లా సురేష్, ఐఐటీ (ఖరగ్‌పూర్) పరీక్షా నిర్వాహకులు పర్యవేక్షించారు.

వైద్య కళాశాలకు సీతారెడ్డి భౌతికకాయం



జగ్గవరపు సీతారెడ్డి (ఫైల్)

చింతలపూడి: యర్రంపల్లికి చెందిన జగ్గవరపు సీతారెడ్డి (72) మరణానంతరం తన భౌతికకాయాన్ని వైద్య విద్యార్థుల పరిశోధనల నిమిత్తం ఏలూరు ఆశ్రమం వైద్య కళాశాలకు అప్పగించాలని గతంలోనే శరీర దాన పత్రాన్ని ఇచ్చారు. కొద్దిరోజులుగా హృద్రోగ సమస్యతో ఆయన హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ శనివారం రాత్రి కన్నుమూశారు. సీతారెడ్డి భౌతికకాయాన్ని కుటుంబసభ్యులు ఆదివారం యర్రంపల్లి తీసుకువచ్చారు. ఆయన భార్య సుధారాణి, కుమారుడు రాకేష్ రెడ్డి, కుమార్తె జి.వాహిని, అల్లుడు జీఎస్ఎస్ఎన్ రెడ్డి తమ కుటుంబ పెద్ద ఆశయాన్ని నెరవేర్చాలని నిర్ణయించుకున్నారు. విషయాన్ని ఆశ్రమం కళాశాల యాజమాన్యానికి తెలియజేయగా కళాశాల సిబ్బంది మధ్యాహ్నం యర్రంపల్లి వచ్చి శరీర దానానికి సంబంధించిన ప్రక్రియను పూర్తిచేశారు. భౌతికకాయాన్ని వైద్య కళాశాలకు తరలించారు. గ్రామంలో జరిగిన సీతారెడ్డి అంతిమయాత్రలో వందలాది మంది బంధువులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

రాట్నాలమ్మకు పూజలు



పెదవేగి : భక్తుల పాలిట కొంగు బంగారం, కోరిన కోర్కెలు తీర్చే చల్లని తల్లి రాట్నాలకుంటలోని రాట్నాలమ్మ ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. విశేష అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు మొక్కలు తీర్చుకుని ప్రత్యేక పూజలు చేయించారు. పూజా టికెట్లపై రూ.39,180, విరాళాల రూపంలో రూ.32,384, లడ్డూ ప్రసాదంపై రూ.30,435, ఫొటోల అమ్మకంపై రూ.3,870 ఆదాయం లభించిందని ఆలయ ఈఓ ఎన్.సతీష్‌కుమార్ తెలిపారు. మొత్తంగా రూ.1,05,869 ఆదాయం సమకూరిందన్నారు.

కామినేనీ ఖబడ్దార్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే డీఎన్నార్

కైకలూరు : నాన్ లోకల్ స్టేట్‌కు చెందిన కామినేని శ్రీనివాస్ చుట్టపు చూపుగా నియోజకవర్గానికి వచ్చి వైఎస్సార్‌సీపీపై విమర్శలు చేస్తే సహించేది లేదని కైకలూరు ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) మండిపడ్డారు. కామినేని స్వగ్రామం వరహాపట్నం సమీప రాచపట్నంలో జరిగిన అంబేడ్కర్ విగ్రహ ఆవిష్కరణ సభలో ఇటీవల కామినేని పలు సభల్లో చేసిన విమర్శలపై ఆదివారం ఎమ్మెల్యే డీఎన్నార్ స్పందించారు. అరాచకాలు చేస్తున్నామని విమర్శిస్తున్న కామినేని గతంలో ఆయన ఇంటిలో ఓ వర్గానికి చెందిన వ్యక్తిని రౌడీమూకలతో చితకబాదించిన ఘటనపై బహిరంగ చర్చకు రావాలని సవాల్ విసిరారు. తాను వెన్నుపోటు పొడిచానని ఆరోపిస్తున్నారని, నమ్మించి మోసం చేయడం కామినేనికి మాత్రమే తెలుసన్నారు. కరోనా సమయంలో ప్రాణాలకు లెక్క చేయకుండా ప్రజలకు సేవలు అందించానని, ఆ సమయంలో కామినేని ఎక్కడున్నారని ప్రశ్నించారు. బీజేపీలో ఉంటూ తెలుగుదేశం పార్టీలో అంటకాగటం కామినేనికి అలవాటని మండిపడ్డారు. నియోజకవర్గంలో పేదలు బాగుంటే పెత్తందారీ వర్గానికి చెందిన కామినేని తట్టుకోలేకపోతున్నారన్నారు. కామినేని మంత్రిగా ఉన్నప్పుడు కైకలూరులో సీహెచ్‌సీలో డాక్టర్లను నియమించలేదని, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో 46 మంది సిబ్బందిని నియమించామన్నారు. తనపై విమర్శలు అర్థరహితమన్నారు. బీజేపీలో ఉంటున్న కామినేని మట్టి టిప్పర్లపై కేంద్రాన్ని నిలదీయాలన్నారు. కులాలు, మతాల మధ్య చిచ్చుపెట్టి పాలించాలనుకునే కామినేని వంటి వ్యక్తులకు ప్రజలు గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. కామినేని అరాచకాలను బహిర్గతం చేయడానికి తాను సిద్ధంగా ఉన్నానని ఆయన గ్రామంలోని లక్ష్మీనృసింహుని ఆలయం వద్ద చర్చకు రావాలని సవాల్ విసిరారు.

దిగ్విజయంగా 'సిద్ధం' సభ



విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యేలు అబ్బయ్యచౌదరి, వాసుబాబు

దెందులూరు : దెందులూరులో జరిగిన వైఎస్సార్‌సీపీ 'సిద్ధం' సభ గ్రాండ్ సక్సెస్ అయ్యిందని, పెద్ద ఎత్తున ప్రజలు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు హాజరుకావడం, దిగ్విజయం చేయడం సంతోషంగా ఉందని దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. ఆదివారం ఏలూరులో ఆయన విలేకరులతో మాట్లాడుతూ సిద్ధం సభకు లక్షలాదిగా ప్రజలు తరలివచ్చి మద్దతు తెలిపారన్నారు. రాష్ట్రమంతా ఒకటే నినాదం అదే జగన్ నినాదమన్నారు. తనతో పాటు రాష్ట్రంలో ఎమ్మెల్యేలకు వైఎస్సార్‌సీపీకి స్టార్ క్యాంపెయినర్లు ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిదారులేనన్నారు. 175కు 175 సీట్లు కచ్చితంగా సాధిస్తామని, మరోమారు జగన్ ముఖ్యమంత్రి కావడం తథ్యమన్నారు. దెందులూరు సభ విజయవంతంతో ప్రతిపక్షాలు సూట్‌కేసులు సర్దుకుని హైదరాబాద్ వెళ్లటానికి సిద్ధపడుతున్నారన్నారు. సభ విజయవంతానికి కృషిచేసిన అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. సభలో విలేకరికి జరిగిన సంఘటన యాధృచ్ఛికమని, మరోమారు పునరావృతం కాకుండా చూస్తామన్నారు. జర్నలిస్టులు మా కుటుంబ సభ్యులేనని, బాధిత జర్నలిస్టు మన్నించాలని కోరారు. ఉంగుటూరు ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు మాట్లాడుతూ సీఎం జగన్ ప్రజాపాలనకు భీమిలి, దెందులూరు సిద్ధం సభలు గ్రాండ్ సక్సెస్ కావడమే నిదర్శనమన్నారు. వైఎస్సార్‌సీపీ శ్రేణులకు ముఖ్యమంత్రి చేసిన దిశానిర్దేశంతో ప్రతిపక్షాల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయన్నారు. దెందులూరు సభలో జరిగిన సంఘటనలో బాధిత విలేకరులకు క్షమాపణ చెబుతున్నానన్నారు. జర్నలిస్టులకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఎప్పుడూ అండగా ఉంటుందన్నారు. సమావేశంలో జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ, బీసీ సెల్ జిల్లా అధ్యక్షులు ఘంటా ప్రసాదరావు, జెడ్పీటీసీ నిట్టా లీలానవకాంతం, దెందులూరు ఏఎంసీ వైస్ చైర్మన్ కాటి సుధాకర్, పోతునూరు సొసైటీ చైర్మన్ డీఎస్‌వీడీ ప్రసాద్ (బజ్జి), రవిబాబు, పులిపాటి దేవానంద్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్యులకు అండగా ప్రభుత్వం

ఎమ్మెల్యే ఆళ్ల నాని హామీ



ఆర్యవైశ్య సంఘాల ప్రమాణ స్వీకార కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆళ్ల నాని

ఏలూరు (ఆర్ఆర్‌పేట): రాష్ట్రంలో ఆర్యవైశ్యులకు ప్రభుత్వం అండగా ఉంటుందని, ఇప్పటికే సీఎం జగన్ రాజకీయంగా ప్రాధాన్యమిస్తున్నారని ఏలూరు ఎమ్మెల్యే ఆళ్ల నాని అన్నారు. ఆదివారం స్థానిక సీఆర్ఆర్ అటానమస్ కళాశాల ఆడిటోరియంలో ఆర్యవైశ్య సంఘం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా, ఏలూరు అర్బన్ ఆర్యవైశ్య సంఘ నూతన కార్యవర్గాల ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్యవైశ్యుల్లో 50 శాతానికి పైగా పేదలు ఉన్నారని, ఆర్యవైశ్యులతో పాటు ఉన్నత వర్గాల్లో పేదలను ఆదుకునేలా సీఎం జగన్ పథకాలు అమలుచేస్తున్నారన్నారు. ఆర్యవైశ్యుల పిల్లలకు మంచి భవిష్యత్ అందించడానికి ఆర్యవైశ్య సంఘాలు ముందుకురావాలని పిలుపునిచ్చారు. ఏలూరులో ఆర్యవైశ్యుల కమ్యూనిటీ హాల్‌కు స్థలం కేటాయింపుతో పాటు రూ.25 లక్షలు ఆర్థికంగా సహకారం అందిస్తామని ఆయన హామీ ఇచ్చారు. సభకు అధ్యక్షత వహించిన ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు చిన్ని రామసత్యనారాయణ మాట్లాడుతూ ఆర్యవైశ్యులకు వడ్డీలేని రుణాలివ్వాలని, రాష్ట్ర రాజధానిలో పొట్టి శ్రీరాములు విగ్రహం, పార్కు ఏర్పాటు చేయాలని కోరారు. రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేష్ మాట్లాడుతూ ఆర్యవైశ్యులు రాజకీయంగా, ఆర్థికంగా మరింత బలపడాల్సిన అవసరం ఉందన్నారు. జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ మాట్లాడారు.

ఘనంగా ప్రమాణ స్వీకారాలు

ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడిగా వెలగా శ్రీరామమూర్తి, కార్యదర్శిగా చిట్టూరి కాశీ విశ్వనాథం, కోశాధికారిగా మామిడి వెంకటేశ్వర రావుతో పాటు ఉపాధ్యక్షులు, సహాయ కార్యదర్శులు, కార్యవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. అలాగే ఏలూరు అర్బన్ జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడిగా దివ్వెల జయ ప్రకాష్, ప్రధాన కార్యదర్శిగా వేమా సురేష్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మద్దుల రవికుమార్, కోశాధికారిగా బచ్చు విష్ణు, గౌరవాధ్యక్షుడిగా గాదంశెట్టి శ్రీనివాస్ తదితరులు ప్రమాణ స్వీకారం చేశారు. ఆర్యవైశ్య సంఘం నాయకులు అంబికా కృష్ణ, జయంతి వెంకటేశ్వర్లు, సీహెచ్ షణ్ముఖ రావు, పెనుగొండ సత్యనారాయణ, ఒబిలిశెట్టి కనకరాజు, వాసవి సుబ్బారావు పాల్గొన్నారు.

అభయమిచ్చిన ఆసరా



ఉంగుటూరు మండలం గొల్లగూడెంలో ఆసరా సభకు హాజరైన మహిళలు

రాష్ట్రంలో మహిళా సాధికారత, స్వావలంబన లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పథకాలు అమలు చేస్తున్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు డ్వాక్రా మహిళలకు వైఎస్సార్ ఆసరా కింద సాయం అందిస్తున్నారు. దీనిలో భాగంగా జిల్లా వ్యాప్తంగా ఆసరా సంబరాలు జరుగుతున్నాయి. ఆదివారం ఉంగుటూరు, ఆచంట నియోజకవర్గాల్లో ఆసరా సంబరాలు నిర్వహించారు.

– ఉంగుటూరు/పెనుగొండ

అభివృద్ధిని చూడండి



రాష్ట్రంలో, నియోజకవర్గంలో చేసిన అభివృద్ధిని చూడండి. కళ్లు ఉండి చూడలేని కబోదులు దుష్ప్రచారం చేస్తున్నారు. ఎవరి మాటలు విని మోసపోకండి.

–బి.గోవిందమ్మ, ఆచంట

నేరుగా నా ఖాతాలోకి..



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో చేపట్టిన సంక్షేమంతో పిల్లల చదువుకు అమ్మఒడి, వైఎస్సార్ ఆసరా పథకాలు తోడ్పడుతున్నాయి. నేరుగా లబ్ధి నా ఖాతాలో జమవుతున్నాయి. డ్వాక్రా రుణమాఫీ ఏడాదికి రూ.14.700 చొప్పున అందింది.

–అల్లు భవానీ, వెలగలేరు

జగన్‌ను మరోమారు ఆశీర్వదించాలి

బడుగు, బలహీనవర్గాల కుటుంబాలు బాగుండాలన్నా.. రాష్ట్ర పరిస్థితి బాగుండాలన్నా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మరోమారు ఓటువేసి ప్రజలంతా ఆశీర్వదించాలి.

–పుప్పాల వాసుబాబు, ఉంగుటూరు ఎమ్మెల్యే

(గొల్లగూడెంలో ఆదివారం జరిగిన ఆసరా కార్యక్రమంలో..)



గొల్లగూడెంలో లబ్ధిదారులకు ఆసరా చెక్కు అందిస్తున్న ఉంగుటూరు ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు

అంబేడ్కర్ ఆశయ సాధనే ప్రభుత్వ లక్ష్యం



అంబేడ్కర్ విగ్రహావిష్కరణలో మండలి చైర్మన్ మోషేన్‌రాజు, ఎంపీ కోటగిరి, ఎమ్మెల్యే డీఎన్నార్, ఎమ్మెల్సీ జయమంగళ

కైకలూరు: అంబేడ్కర్ ఆలోచన విధానాలను రాష్ట్రంలో అమలుచేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దళితులంతా అండగా నిలవాలని శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు అన్నారు. రాచపట్నం నాలుగు రోడ్ల కూడలి వద్ద ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) ఆర్థిక సాయం రూ.1.75 లక్షలతో నిర్మించిన అంబేడ్కర్ విగ్రహాన్ని ఎంపీ కోటగిరి శ్రీధర్, ఎమ్మెల్యే డీఎన్నార్, ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణతో కలిసి ఆదివారం ఆయన ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సభలో మాట్లాడుతూ చదువు ద్వారా మాత్రమే అందరికీ గౌరవం లభిస్తుందని, అటువంటి గొప్ప చదువులను సీఎం జగన్ అందిస్తున్నారన్నారు. ఎంపీ కోటగిరి మాట్లాడుతూ అంబేడ్కర్ కలలను సీఎం జగన్ నెరవేర్చారన్నారు. ప్రభుత్వం ద్వారా లబ్ధి పొందిన ప్రతిఒక్కరూ ఎన్నికల్లో సైనికులుగా పనిచేయాలన్నారు. ఎమ్మెల్యే డీఎన్నార్ మాట్లాడుతూ రాచపట్నం దళితుల చిరకాల వాంఛ అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటుచేశామని, దీనిని అడ్డుకోవడానికి సమీప గ్రామ మాజీ మంత్రి కామినేని శ్రీనివాస్ అడ్డంకులు సృష్టించడానికి ప్రయత్నించినా విజయం సాధించామన్నారు. ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ మాట్లాడుతూ యువత అంబేడ్కర్ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగాలన్నారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ నాయకులు బొడ్డు నోబుల్ మాట్లాడారు. ముందుగా జై భీమ్ అంటూ మండలి చైర్మన్ మోషన్‌రాజు వాహనాన్ని రాచపట్నం గ్రామ దళిత యూత్ బైక్ ర్యాలీ ద్వారా ఊరేగింపుగా తీసుకొచ్చారు. జెడ్పీటీసీలు కురేళ్ల బేబీ, బొర్రా సత్యవతి, ఏఎంసీ చైర్మన్ చేబోయిన వీర్రాజు, సర్పంచ్ అల్లూరి మంగారావు, ఎంపీటీసీ ఈదా కృష్ణ వేణి, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ గంటా సంధ్య, వైఎస్సార్‌సీపీ మండల పార్టీ అధ్యక్షులు భత్రాజు శివాజీ, మొట్రూ ఏసుబాబు, ఉప సర్పంచ్ గొల్ల స్వర్ణకుమారి, నాయకులు సయ్యపురాజు గుర్రాజు, కూనవరపు సతీష్, మోండ సురేష్, అంబేడ్కర్ యూత్ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

11న భీమవరంలో చెస్ పోటీలు

భీమవరం: భీమవరంలో ఈనెల 11వ తేదీన జిల్లా స్థాయి అండర్-7, -9 బాలబాలికల చదరంగ పోటీలు నిర్వహించనున్నట్లు చెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మాదాసు కిషోర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని అనసూయ చెస్ అకాడమీలో ఉదయం 9 గంటల నుంచి ఈ పోటీలను ప్రారంభిస్తామన్నారు. 2017 జనవరి 1వ తేదీలోపు జన్మించిన క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొనేందుకు అర్హులన్నారు. ఈ పోటీల్లో విజేతలు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక అవుతారని స్పష్టం చేశారు. మరిన్ని వివరాలకు 90632 24466 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

కోడిపందేలపై దాడి

23 మంది అరెస్టు, రూ.4.89 లక్షల నగదు, 29 బైక్‌లు, 8 కార్లు స్వాధీనం

నరసాపురం రూరల్: నరసాపురం రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని మల్లవరం గ్రామ శివారున ఆక్వా చెర్వుల వద్ద నిర్వహిస్తున్న కోడిపందేలపై పోలీసులు దాడి చేశారు. సీఐ కె.గోవిందరాజుకు అందిన సమాచారం మేరకు శనివారం రాత్రి 11 గంటల ప్రాంతంలో చేసిన ఈ దాడిలో 23 మంది వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.4,89,460 నగదు, 26 కోళ్లు, 57 కత్తులు, 31 సెల్‌ఫోన్లు, 29 బైక్‌లు, ఎనిమిది కార్లు స్వాధీనం చేసుకున్నారు. నరసాపురం పట్టణం, రూరల్ ఎస్సైలు బీఎస్‌డీఆర్ ప్రసాద్, గురయ్యలతో పాటు సిబ్బంది దాడుల్లో పాల్గొన్నారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్సై గురయ్య తెలిపారు.

కొవ్వాడ పరిసర గ్రామాలు అప్రమత్తంగా ఉండాలి

డీఎఫ్ఓ రవీంద్ర ధామ

బుట్టాయగూడెం: కొవ్వాడ పరిసర గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డీఎఫ్ఓ రవీంద్ర ధామ అన్నారు. కొవ్వాడ సమీపంలో పులి ఆవుపై దాడి చేసి చంపిన సంఘటనా స్థలాన్ని ఆయన ఆదివారం పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ కొవ్వాడ పరిసర ప్రాంతాలో పులి పాదముద్రలను గుర్తించామన్నారు. ఈ నేపథ్యంలో కొవ్వాడ సమీప గ్రామాలైన రాజవరం, ఎర్రాయిగూడెం, కామయ్యకుంట, లంకాలపల్లి, నాగన్నగూడెం, బండార్లగూడెం, పందుగూడెం, కోపల్లి, వీరన్నపాలెం, దిప్పకాయలపాడు, కన్నాపురం తదితర గ్రామాల ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండాలని కోరారు. పులి సంచరించే ప్రాంతాల చుట్టూ 10 కిలోమీటర్ల దూరంలో 10 గ్రామాల ప్రజలను అప్రమత్తం చేశామన్నారు. నిరంతరం పులి కదలికలను తెలుసుకుంటున్నామని, ప్రత్యేక టీమ్‌లతో పెట్రోలింగ్, మైక్‌ల ద్వారా ఈ గ్రామాల ప్రజలకు జాగ్రత్తలు సూచించామని వివరించారు.

సస్యరక్షణతోనే మామిడిలో లాభాలు

నూజివీడు: మామిడిలో సకాలంలో సస్యరక్షణ చర్యలు తీసుకుని శాస్త్రవేత్తల సూచనలను, సలహాలను రైతులు తప్పనిసరిగా ఆచరించినట్లయితే మామిడి సాగు లాభసాటిగా మారుతుంది. నాణ్యమైన దిగుబడులను రైతులు సాధించడం ద్వారా రాష్ట్రం, దేశంలోని మార్కెట్‌లలో మంచి ధర లభించడమే కాక విదేశాలకు ఎగుమతులు సైతం పెరిగే అవకాశం ఉంది. ఏలూరు జిల్లాలో మామిడి పంట దాదాపు 50 వేల ఎకరాల విస్తీర్ణంలో సాగులో ఉండగా, దీనిలో 90 శాతానికి పైగా నూజివీడు నియోజకవర్గంలోనే ఉంది. ఈ ప్రాంతం నుంచి మామిడిని ముంబై, ఇండోర్, జహీరాబాద్, హైదరాబాద్, నున్న మార్కెట్‌లకు ఎగుమతి అవుతుంటాయి. డిసెంబర్‌లో పూతలు ప్రారంభమై ఫిబ్రవరి తొలివారానికి మామిడి పిందెలు ఏర్పడతాయి. మార్చి మొదటి వారం నుంచి మామిడి కాయలు కోతకు వస్తాయి. మార్కెట్‌లో మంచి ధర లభిస్తే మామిడి రైతులకు పండుగే. నాణ్యమైన దిగుబడులు సాధించడానికి నూజివీడులోని మామిడి పరిశోధనస్థానం ప్రధాన శాస్త్రవేత్త బొర్రా కనకమహాలక్ష్మి రైతులకు పలు సూచనలు, సలహాలు అందిస్తున్నారు.





నూజివీడులో పూతకు వచ్చిన మామిడి చెట్టు, అంతరచిత్రంలో పూత కాడలపై తేనెమంచు పురుగులు

పచ్చిపూత, తెల్లపూత దశల్లో తోటలు

మామిడి తోటలు ప్రస్తుతం కొన్ని మొగ్గ, పచ్చిపూత, తెల్లపూత దశల్లో ఉన్నాయి. మామిడిలో పూత రాలడం సహజం కాగా, మొగ్గ పుష్పాలు, ఫలదీకరణ చెందని పుష్పాలు రాలిపోతాయి. దీనిని చూసి రైతులు ఆందోళన చెందక్కర్లేదు. అలాగే తేనె మంచు పురుగు, తామర పురుగు, కాయపుచ్చు పురుగు, పిండినల్లి, టెంక పురుగులు, పక్షికన్ను తెగులు, బూడిద తెగులు, నల్లమచ్చ తెగులు మామిడిలో అధిక నష్టం కలిగించే వాటిలో ముఖ్యమైనవి.

తెగుళ్లు.. నివారణ

- పూత అధికంగా రాలుతున్నట్లయితే ఒక ఎంఎల్ నాప్తలిన్ ఎసిటిక్ ఆమ్లం 20 పీపీఎం కానీ, ప్లానోఫిక్స్ ఒక ఎంఎల్‌ను 4.5 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి.
- తేనెమంచు పురుగు పూత నుంచి లేత చిగుళ్ల నుంచి రసం పీల్చడం వల్ల పూత రాలిపోతుంది. ఈ పురుగులు విసర్జించిన తేనె వంటి జిగురుపై మసి తెగులు వృద్ధి చెందుతుంది. తేనె మంచు పురుగు నివారణకు వేపనూనె 1500 పీపీఎం 3ఎంఎల్ లేదా ఇమిడాక్లోప్రిడ్ 0.3 ఎంఎల్ లేదా థైయోమిథాక్సామ్ 0.5 ఎంఎల్ లేదా క్లోరోపైరిఫాస్ 20 ఈసీ 2.5 ఎంఎల్ మందును లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి.
- తామర పురుగు ఉధృతి తెలుసుకోవడానికి తోటలో జిగురు అట్టలను చెట్ల మధ్య అక్కడక్కడ ఏర్పాటు చేసుకోవాలి. తామర పురుగు మొదటి దశలో వేపనూనె 1500 పీపీఎం 3ఎంఎల్ లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి. ఉధృతి అధికంగా ఉన్నట్లయితే స్పైనోసాడ్ 0.25 ఎంఎల్, థయోమిథాక్సామ్ 0.5 గ్రా లేదా, ఫిప్రోనిల్ గోల్డ్ 2 ఎంఎల్, ఇమిడాక్లోప్రిడ్ 0.3ఎంఎల్ మందును లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.
- మామిడి తోటల్లో పూమొగ్గలు, రెమ్మలపై పక్షికన్ను తెగులును గమనించినట్లయితే కార్బండిజమ్ ఒక గ్రా లేదా డైథేన్ ఎం-45 2గ్రా లేదా క్లోరోథాలోనిల్ ఒక గ్రాము లేదా క్రిమి సంహారక మందులతో కలిపి పిచికారీ చేయాలి.
- వాతావరణంలో రాత్రి చలి అధికంగా, పగలు వేడి వాతావరణంగా ఉన్నప్పుడు బూడిద తెగులు ఆశిస్తుంది. దీని నివారణకు హెక్సాకోనోజోల్ గాని, ప్రోపికోనాజోల్ గాని, డైఫెన్‌కోనాజోల్ 2 ఎంఎల్ లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.
- మామిడిలో బంగినపల్లి రకాలను ఆశించే నల్లమచ్చ తెగులు నివారణకు లీటరు నీటికి కాపర్ ఆక్సీక్లోరైడ్ 3 గ్రాములతో పాటు ఆగ్రోమైసిన్ 2 గ్రాముల మందును పది లీటర్ల నీటికి కలిపి 15 రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేయాలి.



బొర్రా కనకమహాలక్ష్మి, మామిడి పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త

ఎల్లలు దాటిన వలంటీర్ల సేవలు



విజయవాడలో బిక్షంకు పెన్షన్ సొమ్ము అందజేస్తున్న వలంటీర్ సింధూజ



గుంటూరులో మరియమ్మకు పెన్షన్ సొమ్ము అందజేస్తున్న వలంటీర్ వినోద్



కూనవరంలో సుశీలకు పింఛన్ సొమ్ము అందజేస్తున్న వలంటీర్ నరసింహారావు



చెరుకుమిల్లిలో లక్ష్మీ నరసమ్మకు పెన్షన్ అందజేస్తున్న వలంటీర్ కుప్పాల రామకృష్ణ

ఏలూరు (ఆర్ఆర్‌పేట): సుదూర ప్రాంతాల్లో ఉన్నా లబ్ధిదారులకు పెన్షన్‌సొమ్ము అందించేందుకు వలంటీర్లు విశేషంగా కృషి చేస్తున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అవ్వాతాతల కష్టాలను గుర్తించి వారి ఇంటి వద్దకే వెళ్లి నెలలో మొదటి రెండుమూడు రోజుల్లోనే పింఛను సొమ్ము అందించే సేవలను వలంటీర్ల ద్వారా చేపట్టారు. ముఖ్యమంత్రి స్ఫూర్తితో కొంతమంది వలంటీర్లు స్వచ్ఛందంగా వ్యయప్రయాసలకోర్చి లబ్ధిదారులకు పింఛను సొమ్ము అందజేస్తున్నారు. నగరంలోని 20వ డివిజన్, రామకృష్ణాపురానికి చెందిన వేదాంతం లక్ష్మీ నరసమ్మ (80) వయోభారంతో కదలలేని పరిస్థితిలో ఆకివీడు సమీపంలోని చెరుకుమిల్లిలోని తన కుమార్తె వద్ద ఉంటోంది. రామకృష్ణాపురం వలంటీర్ కుప్పాల రామకృష్ణ ఆదివారం 45 కి.మీ. దూరంలో ఉన్న చెరుకుమిల్లికి వెళ్లి ఆమెకు పెన్షన్ అందించారు. లక్ష్మీ నరసమ్మ కుటుంబ సభ్యులు వలంటీర్ రామకృష్ణకు, కార్పొరేటర్ జీహెచ్‌డీ ప్రసాద్‌కు, సీఎం వైఎస్ జగన్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

గుంటూరు వెళ్లి..

చాట్రాయి: నరసింహారావుపాలెం గ్రామానికి చెందిన సింగపాం మరియమ్మ అనారోగ్యానికి గురై గుంటూరు ప్రైవేటు ఆస్పత్రిలో చేరి వారం రోజులుగా చికిత్స తీసుకుంటోంది. నరసింహారావుపాలెం వలంటీర్ పల్లె వినోద్ ఆదివారం గుంటూరు వెళ్లి మరియమ్మకు రూ.3 వేలు వృద్ధాప్య పెన్షన్ అందచేశాడు. అదేవిధంగా సూరంపాలెం గ్రామానికి చెందిన పరసా బిక్షం 10 రోజుల క్రితం అనారోగ్యానికి గురై విజయవాడ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఆ ఏరియా వలంటీర్ చీపు సింధూజ ఆదివారం విజయవాడ వెళ్లి బిక్షానికి పెన్షన్ అందజేసింది.

కూనవరం వెళ్లి..

కామవరపుకోట: వృద్ధురాలి ఆర్థిక అవసరాలు తీర్చాలనే ఉద్దేశంతో సొంత ఖర్చుతో సుమారు 180 కిలోమీటర్లు ప్రయాణించి పింఛన్ అందజేసి తన ఔదార్యాన్ని చాటాడు కామవరపుకోట సచివాలయ వలంటీర్ వేముల సాయి నరసింహారావు. కామవరపుకోటకు చెందిన దీకొండ సుశీల అనారోగ్యంతో అల్లూరి సీతారామరాజు జిల్లా కూనవరం మండలం కూనవరంలో బంధువుల ఇంటి వద్ద ఉంటోంది. గ్రామంలో అందుబాటులో లేకపోవడంతో సుశీలకు మందులు, వైద్య ఖర్చుల నిమిత్తం సొమ్ము అత్యవసరమని భావించిన వలంటీర్ నరసింహారావు ఆదివారం కూనవరం వెళ్లి సుశీలకు పింఛను సొమ్ము అందజేశాడు. దీనితో సుశీల, ఆమె బంధువులు వలంటీర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

జగన్ వల్లే గ్రామ స్వరాజ్యం సాకారం

కైకలూరు: గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం నేడు కళ్ల ముందు కనిపిస్తోందంటే దానికి కారణం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సుపరిపాలన అని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) అన్నారు. వరహాపట్నంలో రూ.43.60 లక్షలతో సచివాలయం, రూ.20.80 లక్షలతో వైఎస్సార్ గ్రామీణ ఆరోగ్య కేంద్ర భవనాలను ఎంపీ కోటగిరి శ్రీధర్, ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్), ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణతో కలిసి మండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు ఆదివారం ప్రారంభించారు. అధ్యక్షతన వహించిన డీఎన్నార్ మాట్లాడుతూ ఆరోగ్యశ్రీలో రూ.25 లక్షల వరకు వైద్యం చేయించుకునే అవకాశాన్ని సీఎం వైఎస్ జగన్ కల్పించారన్నారు. ఆరోగ్య కేంద్ర భవనానికి పల్లెవాడకు చెందిన జుంగా మోహన్ రూ.13,500 విలువ చేసే మూడు ర్యాక్‌లను బహూకరించారు. జెడ్పీటీసీ సభ్యులు కురేళ్ల బేబీ, బొర్రా సత్యవతి, ఏఎంసీ చైర్మన్ చేబోయిన వీర్రాజు, సర్పంచ్ ఉప్పలపాటి నాగమణి, ఎంపీటీసీ సభ్యులు పందు గాంధీ, వైస్ ఎంపీపీలు కూసంపూడి కనక దుర్గారాణి, కట్టా నాగలక్ష్మి, చొప్పర్ల సునీత, రామారి రాధ పాల్గొన్నారు.



సచివాలయ ప్రారంభోత్సవంలో మోషేన్‌రాజు, కోటగిరి, డీఎన్నార్, జయమంగళ తదితరులు

నిరంతర సాధనతోనే ఉన్నత శిఖరాలకు

రాష్ట్ర సాహిత్య అకాడమీ చైర్‌పర్సన్ పిల్లంగోళ్ల శ్రీలక్ష్మి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ప్రతి వ్యక్తీ తాను ఎంచుకున్న రంగంలో నిరంతర సాధన, అకుంఠిత దీక్షతో ఉన్నత స్థానాలకు చేరుకోవచ్చని రాష్ట్ర సాహిత్య అకాడమీ చైర్‌పర్సన్ పిల్లంగోళ్ల శ్రీలక్ష్మి అన్నారు. ఆదివారం ఏలూరులోని వైఎంహెచ్ఏ హాలులో నగరానికి చెందిన గుప్త ఫౌండేషన్ ఆధ్వర్యంలో మదుపల్లి కృష్ణమూర్తి సాహిత్య పురస్కార ప్రదాన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న శ్రీలక్ష్మి మాట్లాడుతూ నగరానికి చెందిన మదుపల్లి మోహన గుప్త ఎగుమతుల రంగంలో ఉన్నత స్థానానికి ఎదిగారన్నారు. ఆయన జీవితం ఎంతోమంది ఔత్సాహికులకు స్ఫూర్తిదాయకమన్నారు. సాహిత్యానికి ఆయన ఎంతో ప్రాధాన్యత ఇస్తున్నారని చెప్పారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో వైఎస్సార్ లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డులను ప్రవేశపెట్టి ఎంతోమంది సాహితీవేత్తలను గుర్తించి పురస్కారాలు అందిస్తున్నారని ఈ సందర్భంగా గుర్తు చేశారు.

బహుముఖ ప్రజ్ఞాశాలి కొలకలూరి ఇనాక్

సాహితీ రంగంలో కొలకలూరి ఇనాక్ అందుకోని పురస్కారాలు లేవని, ఆయన బహుముఖ ప్రజ్ఞాశాలి అని, పద్మశ్రీ అవార్డు అందుకుని సాహిత్యరంగానికి సమాజంలో ఉన్నత స్థానాలు దక్కడంలో ఆయన చేసిన సేవలు విశేషమని శ్రీలక్ష్మి చెప్పారు. సాహిత్య అకాడమీ మాజీ చైర్మన్‌గా ఇనాక్ అందించిన సేవలే తనకు ఆదర్శంగా నిలిచాయన్నారు. మదుపల్లి మోహన గుప్త మాట్లాడుతూ చెన్నైకి చెందిన రాజ్యలక్ష్మి ఫౌండేషన్ సేవల స్ఫూర్తితో తాను గుప్త ఫౌండేషన్‌ను ఏర్పాటు చేశానన్నారు. ఉత్తమ ఎక్స్‌పోర్టర్‌గా తనకు లభించిన అవార్డు సందర్భంగా తాను సైతం సేవా కార్యక్రమాలు చేయాలని నిర్ణయించానన్నారు. ఫౌండేషన్ ఏర్పాటు చేసి విభిన్న రంగాలకు చెందిన ఎందరో ప్రముఖులను నగరానికి తీసుకువచ్చి వారిని సత్కరించామన్నారు.



చెన్నై అడయార్ క్యాన్సర్ ఆసుపత్రి ప్రతినిధికి రూ.25 లక్షల చెక్కును అందిస్తున్న మదుపల్లి మోహనగుప్త

తండ్రే కాదూ.. సాహితీవేత్తగా ఉన్నతమైన వ్యక్తి

కుప్పం ద్రవిడ యూనివర్సిటీ ఉపకులపతి కొలకలూరి మధుజ్యోతి మాట్లాడుతూ గుప్త వంటి సేవామూర్తులు నిత్యం కుబేరులుగా వెలుగొందితే సమాజానికి మరిన్ని సేవా కార్యక్రమాలు చేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. కొలకలూరి ఇనాక్ తన తండ్రిగా, సాహితీవేత్తగా ఎంతో ఉన్నతమైన వ్యక్తి అన్నారు. ఘనమైన సాహితీ వేదికపై ఇనాక్ తనను తాను నిలబెట్టుకున్నారని వివరించారు. సాహిత్య రంగానికి సేవలు చేయాలనే ఆయన ఆశయాన్ని ప్రభుత్వం గుర్తించి సాహిత్య అకాడమీ చైర్మన్ పదవి ఇవ్వగా సాహితీ సేవా కార్యక్రమాలు విస్తరించారని స్పష్టం చేశారు. పురస్కారం అందుకున్న ఇనాక్ గుప్త ఫౌండేషన్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

విర్డ్ ఆస్పత్రిలో ఆర్థోపెడిక్ కాన్ఫరెన్స్

ద్వారకాతిరుమల: స్థానిక విర్డ్ ఆస్పత్రిలో ఆదివారం ఆర్థోప్లాస్టీ హిప్, నీకాప్ క్లేవ్ ఆర్థోపెడిక్ కాన్ఫరెన్స్‌ను నిర్వహించారు. జాతీయ స్థాయిలో ప్రముఖులైన 14 మంది ఫ్యాకల్టీస్, అలాగే 150 మంది వైద్య ప్రతినిధులు ఇందులో పాల్గొన్నారు. ఈనెల 3, 4 తేదీల్లో మోకాలు, తుంటికి సంబంధించిన 16 ఇన్వెస్టిడ్, రివిజన్ శస్త్రచికిత్సలను విజయవంతంగా చేశారు. వైద్యులు తమ విజ్ఞానాన్ని, నైపుణ్యాన్ని మరింత పెంపొందించుకునేందుకు ఈ కాన్ఫరెన్స్ ఎంతగానో ఉపయోగపడుతుందని విర్డ్ ఆస్పత్రి ట్రస్ట్ చైర్మన్ ఎస్వీ సుధాకరరావు అన్నారు. ఈ క్యాంప్‌లో వైద్యులు ఇ.కృష్ణకిరణ్, రాజేష్ మల్హోత్ర, విజయ్‌మోహన్, అనిల్ థామస్ ఒమెన్, ఎన్.రాజ్‌కుమార్, పి.సుమన్, పి.శివయ్య, ఎం.హేమంత్, ఎం.మహేష్ కులకర్ణి, విర్డ్ ఆస్పత్రి ట్రస్ట్ సభ్యులు ఐవీఆర్ సుధాకరరావు, వి.నారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

అప్పులభారంతో దంపతుల ఆత్మహత్య



సత్యనారాయణ, లక్ష్మి మృతదేహాలు

పెనుగొండ: సిద్ధాంతం శివారు సాలిపేటలో ఆర్థిక ఇబ్బందులతో దంపతులు ఆత్మహత్యకు పాల్పడ్డారు. పోలీసులు, కుటుంబసభ్యులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సాలిపేటలో పడవల సత్యనారాయణ (54), పడవల లక్ష్మి (50) భార్యాభర్తలు. సత్యనారాయణ మేనమామ ఇంట్లో కొంతకాలంగా నివాసం ఉంటున్నారు. వీరికి ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు సంతానం కాగా, వీరందరికీ వివాహాలు చేశారు. సత్యనారాయణ గతంలో గ్రామంలో బట్టలషాపు నిర్వహించేవాడు. కరోనా సమయంలో నష్టాలు రావడంతో షాపును అమ్మేశాడు. కొంతకాలంగా పెనుగొండలోని బట్టలషాపులో పనిచేస్తున్నాడు. కరోనాలో నష్టం రావడంతో పాటు కుమార్తెల పెళ్లిళ్లకు కొంత అప్పులు చేశాడు. దీంతో దాదాపు రూ.5 లక్షలు అప్పులు ఉన్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ నేపథ్యంలో సత్యనారాయణ, లక్ష్మి దంపతులు ఆదివారం తమ ఇంట్లో వేర్వేరు గదుల్లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఇంట్లో నాలుగు పేజీల సూసైడ్ నోట్ రాసి తమ చావుకు ఎవరూ బాధ్యులు కాదని అందులో పేర్కొన్నారు. సత్యనారాయణ, లక్ష్మీ దంపతులు ఆత్మహత్యకు పాల్పడడంతో మృతదేహాల వద్ద కుటుంబసభ్యులు, బంధువులు రోదించడం చూసి అక్కడున్న గ్రామస్తులు కంటతడిపెట్టారు. స్థానికుల సమాచారంతో ఆచంట ఎస్సై రాజ్‌కుమార్ ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం తణుకు ప్రభుత్వాసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉప్పుటేరులో దూకి వ్యక్తి గల్లంతు

ఆకివీడు: దుంపగడపలో ఆర్అండ్‌బీ వంతెన పైనుంచి ఉప్పుటేరులోకి దూకి ఓ వ్యక్తి ఆదివారం సాయంత్రం గల్లంతయ్యాడు. వివరాలిలా ఉన్నాయి. స్థానికంగా ఒక బేకరీలో పనిచేస్తున్న సోము అని స్థానికుల ద్వారా సమాచారం తెలిసిందని సిబ్బంది తెలిపారు. ఉప్పుటేరులో వంతెన వద్ద పడవలపై గాలింపు చర్యలను అగ్నిమాపక సిబ్బంది చేపట్టారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. సంఘటన స్థలానికి ఎస్సై నాగబాబు చేరుకుని గాలింపు చర్యలను పర్యవేక్షిస్తున్నారు.